





AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## తెలంగాణ తిరుమలలో సివిల్ జడ్జి వివాహం



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి వివాహం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. బీర్కూర్ గ్రామ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కార్యక్రమం నిర్వహించారు. వివాహ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు బీర్కూర్ సర్పంచ్ అరిగే ధర్మ తేజ, బీఆర్ఎస్ యువ నాయకులు బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.






## నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేంద్రం నిర్వాహకులు రికార్డులు, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయద్దని అధికారులను ఆదేశించారు. పీసీపీ ఎన్డీటీ చట్టంపై విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ బస్వా రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, పీవో సుప్రియ, శిఖర, డిప్యూటీ డీఎంహెచ్‌వో అశ్విని, సమత, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసినా ప్రజలు కనికరించలేదు..: ప్రశాంత్‌రెడ్డి




**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ పట్టణాన్ని రూ.కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినప్పటికీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమపై దయ చూపలేదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భీమ్‌గల్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో విజయం సాధించినా, అపజయం ఎదురైనా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడుతుందన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తూనే, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా గెలిచినా, ఓడినా కౌన్సిలర్ అభ్యర్థులందరం కలిసి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం, కొత్త కౌన్సిలర్లు వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 శాతం పూర్తయిన 100 పడకల ఆస్పత్రిని, 70శాతం పూర్తయిన మార్కెట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కోరారు. మూతపడిన భీమ్‌గల్ బస్ డిపో ను తెరిపించి, బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, మాజీ జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, పార్టీ ముఖ్య నేతలు, నూతన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రక్షాళనకు విద్యాశాఖ సిద్ధమైంది. ఏళ్లుగా తిష్ట వేసిన ఉద్యోగుల సెక్షన్లను మార్పు చేసేలా రంగం సిద్ధం చేసింది. ప్రధానంగా ప్రైవేటు పాఠశాలల విభాగాలను చూసే సిబ్బందిని మార్చాలంటూ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలోనూ ఉద్యోగుల సెక్షన్లను మార్చే దిశగా అడుగులు వేస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో పూర్తి ప్రక్షాళన జరిగే అవకాశం ఉంది.

- అక్షరటుడే, ఇందూరు

# విద్యాశాఖలో ఉద్యోగుల ప్రక్షాళన




- ప్రైవేట్ స్కూల్ సెక్షన్స్ మార్చాలని ఉన్నతాధికారుల ఆదేశం
- జిల్లాలో ఏళ్లుగా తిష్ట వేసిన ఉద్యోగులు..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మొత్తం 35 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఇందులో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు తొమ్మిది మంది ఉద్యోగులు ప్రైవేట్ స్కూళ్లకు సంబంధించిన వ్యవహారాలు చూస్తుంటారు. ప్రధానంగా ఓపెనింగ్ పర్మిషన్స్ రెన్యువల్, ఈటీఆర్, సీబీఎస్ఈ, ఐసీఎస్సీలకు ఎన్‌వోసీలను జారీ తదితర విధులు నిర్వహిస్తారు. అయితే ఏడాది కంటే ఎక్కువగా ఒకే సెక్షన్‌లో విధులు నిర్వహించే వారిని తక్షణమే మార్చాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖలో మార్పుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

### ఏళ్లుగా పాతుకుపోయిన సిబ్బంది

జిల్లా విద్యాశాఖలో ప్రైవేటు పాఠశాలల వ్యవహారాలు చూసే పలువురు సిబ్బంది ఏళ్లుగా పాతుకుపోయారు. జిల్లాలోని 33 మండలాలలోని ప్రైవేటు స్కూళ్ల వ్యవహారాలను తొమ్మది మంది సిబ్బందికి అప్పజెప్పారు. ఇందులో సుమారు ఐదుగురు ఉద్యోగులు మూడేళ్లకు పైగానే అదే సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో కొందరిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు స్కూళ్ల పనులు కావాలంటే ఎంతో కొంత సమర్పించుకోవాలని స్వయంగా ప్రైవేటు యాజమాన్యాలే చెబుతున్నాయి. ఇటువంటి వారిని ప్రక్షాళన చేసే విధంగా రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. నిజానికి ఉద్యోగులను ఒకే సెక్షన్ కింద ఎక్కువ సంవత్సరాలు ఉంచకూడదని నిబంధన కూడా ఉంది. ఇలా విధులు నిర్వహించడం వల్ల అవినీతి జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

### ఉత్తర్వుల్లో ఏముందంటే..

తాజాగా రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో ప్రైవేటు పాఠశాలల సిబ్బందిని మార్చాలని పేర్కొంది. ఏడాదికి పైబడిన ఉద్యోగులను వేరే సెక్షన్‌కు మార్చాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అదే సెక్షన్‌కు సంబంధించిన వారిని పరస్పర మార్పిడి చేయకూడదని స్పష్టం చేసింది. ప్రస్తుతం జిల్లాలో ఏడాదికి పైగా విధులు నిర్వహిస్తున్న వారు సుమారు ఐదుగురు ఉద్యోగులు ఉన్నారు.






# బాల్కొండలో గంజాయి గ్యాంగ్ గుట్టురట్టు

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలో గంజాయి గ్యాంగ్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీపీ సాయిచైతన్య శుక్రవారం వెల్లడించారు. బాల్కొండ జూనియర్ కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.2 కిలోల గంజాయి, 6 మొబైల్ ఫోన్లు, బైక్ ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని తెలిపారు. నిందితులు మహమ్మద్ అమ్జత్ అలీ (పెర్కిట్), మహమ్మద్ నయీం (పెర్కిట్), ఆద్నాన్ (ఆర్మూర్), చిల్వేరు మనోజ్ కుమార్ (కిసాన్‌నగర్), జక్కుల గోవింద్ (బాల్కొండ), ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో నలుగురు వ్యక్తులు మున్ని (కిన్వట్), వహీద్ సుల్తాన్, సోఫియాన్, మోసిన్ (ఆర్మూర్) పరారీలో సీపీ వెల్లడించారు. గంజాయి విక్రయంలో ప్రధాన నిందితుడు అమ్జత్ అలీ మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతం నుంచి కిలోకు సుమారు రూ.20 వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసేవాడని చెప్పారు. అక్కడి నుంచి తీసుకొచ్చి బాల్కొండ, పెర్కిట్, ఆర్మూర్ ప్రాంతాల్లో చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందదన్నారు. 5 గ్రాముల ప్యాకెట్లను రూ.400-500లకు విక్రయిస్తూ, ఒక్కో ప్యాకెట్‌పై రూ.100 కమిషన్ విధానంలో ఇతర నిందితులను ఏజెంట్లుగా ఉపయోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యువతను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్ల ద్వారా ఆర్డర్లు తీసుకుని సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. గంజాయి విక్రయంలో బాలుడిని ఉపయోగించినందుకు జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. మిగతా నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. కేసు ఛేదనలో కీలకమైన ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, బాల్కొండ ఎస్సై శైలేందర్, కానిస్టేబుళ్లు శంకర్, భారత్ గౌడ్, హోంగార్డ్ నవీన్‌లను సీపీ అభినందించారు.



## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు నవీన్ గౌడ్, నారాయణ, గైని రాజు పలువురు శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారుతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరాఠి శ్రీనివాస్, బీజేపీ నాయకులు అబ్బగొని రామాగౌడ్ సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.



## నిజానిజాలు తేల్చుదాం.. ఆధారాలతో రండి..: ఎమ్మెల్యే

**అక్షరటుడే, కామారెడ్డి:** నాలుగు రోజులుగా కామారెడ్డిలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇరువర్గాలు చర్చకు సిద్ధమని, సమయం, స్థలం చెప్పాలని సవాళ్లు చేసుకున్నాయి. తాజాగా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మరో ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూములు అరోరా కళాశాలకు ధారాదత్తం చేశారని, సరస్వతి శిశుమందిర్, అరోరా కాలేజ్ విషయంలో కాంగ్రెస్, నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే ప్రకటించారు. ఆధారాలతో సహా శనివారం ఉదయం 10 గంటలకు సరస్వతి శిశు మందిర్ వద్దకు వస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు శిశుమందిర్ వద్దకు ఆధారాలతో సహా రావాలని కేవీఆర్ సవాల్ చేశారు. తనతో పాటు కళాశాల ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు, శిశుమందిర్, అరోరా కళాశాల యాజమాన్యం, కళాశాల సూపర్‌వైజర్ కామారెడ్డి వాసి జంగం నరేష్, కర్షక్ బీఈడీ కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వస్తారన్నారు. ఉదయం 10 గంటలకు చర్చకు రావాలని, నిజానిజాలు తెలుస్తానని, ఆధారాలు బయట పెడతానని ఎమ్మెల్యే పేర్కొనడం ఒక్కసారిగా తీవ్ర చర్చకు దారి తీసింది.

## బీసీ బిడ్డకు మేయర్ బాధ్యతలిచ్చాం..: మంత్రి పొన్నం ప్రభాకర్

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్‌గా బీసీ బిడ్డకు బాధ్యతలు అప్పగించామని.. అభివృద్ధిలో కాంగ్రెస్ మార్క్ కచ్చితంగా చూపిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కూరగాయల ఉమారాణి మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ సల్మా తహసీన్ కూడా బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని అలాగే మున్సిపల్ ఎన్నికలలోనూ ఆశీర్వదించారన్నారు. ప్రజల ఆలోచన మేరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. 2014లో తెలంగాణ ప్రత్యేక బిల్లు పాసైంది ఇదే రోజన్నారు. ఇప్పటికీ 12 ఏళ్లు అయిందని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై వివక్ష చూపిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు కచ్చితంగా న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. 250 గజాల స్థలానికి సంబంధించి త్వరలోనే కమిటీ వేసి తగు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడం తమ బాధ్యత అని చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత అభివృద్ధి తమ లక్ష్యమని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లకు సమన్యాయం చేయాలని మేయర్‌కు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించారని అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కూడా ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

**అక్షరటుడే, కామారెడ్డి :** అత్యధిక లాభాలు తెచ్చే ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. పాల్వంచ మండల కేంద్రంలో శుక్రవారం హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పాల్వంచ మర్రి శివారులో మొక్కలు నాటారు. అనంతరం ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాతో తనకు చాలా అనుబంధం ఉందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రొడక్ట్స్ తయారు చేసే పెద్ద కంపెనీ హిందూస్తాన్ యూనిలివర్ కంపెనీ అని అందుకే ఈ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు బాధ్యత ఆ కంపెనీకి అప్పగించామన్నారు. రైతులు సంతోషంగా ఉండాలని, ఆ బాధ్యత కంపెనీ తీసుకోవాలని, రైతులకు సూచనలివ్వాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగులో ఇతర పంటలు కూడా వేసుకోవచ్చని మంత్రి తెలిపారు. రైతాంగానికి మేలు జరగాలని, ఈ పంటను వేసుకోవాలని రైతులకు సూచిస్తున్నామని తెలిపారు. రెండు రోజుల క్రితం కేంద్ర మంత్రిని.. మంత్రి ఉత్తమ్, తాను కలిస్తే తెలుగు రాష్ట్రాల నుంచి దొడ్డు బియ్యం సేకరించలేమని చెప్పారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు బాధ్యత ఒక్కో జిల్లాలో ఒక్కొక్క కంపెనీకి ఇచ్చామని మంత్రి తెలిపారు. అన్ని జిల్లాల్లో ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. పంట కోసిన 24 గంటల్లో పంటను తరలిస్తారన్నారు. ఆ బాధ్యత కంపెనీ వారిదేనని తెలిపారు. రూ.300 కోట్లతో సిద్ధిపేటలో ఫ్యాక్టరీ నిర్మించామని, ఈనెల 24 సీఎంతో ప్రారంభం చేయబోతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో టన్నుకు రూ.25వేల ధర వచ్చేలా ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. హైదరాబాద్‌కు దగ్గర ఉండడంతో కామారెడ్డి భవిష్యత్‌లో ఆయిల్ పామ్ సాగుకు సెంటర్ కాబోతోందని తెలిపారు. అత్యధిక లాభాలు ఇచ్చే ఆయిల్ ఫార్మింగ్ చేయడానికి రైతులు నిర్భయంగా ముందుకు రావాలని సూచించారు. రాష్ట్రం మొత్తం పచ్చబడాలని, రైతులు బాగుండాలని సీఎం ఆకాంక్ష అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా హార్టికల్చర్ అధికారిణి జ్యోతి, హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉపాధిహామీ అధికారులకు ఎంపీడీవో తాహెరా బేగం సూచించారు. వాటర్ డే సందర్భంగా సోమర్యాగడి తండా, మీసాన్ పల్లి నర్సరీలో శుక్రవారం మొక్కలకు నీటిని పట్టారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ముందుగా చేపట్టాలని పేర్కొన్నారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా మూడు పూటలా నీటిని పట్టాలని సూచించారు. ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఆమెతోపాటు ఎంపీవో ప్రకాష్, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



## ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు 'మన ఇసుక వాహనం' సేవలు

**అక్షరటుడే, కోటగిరి :** ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకే 'మన ఇసుక వాహనం' సేవలు ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పోతంగల్ మండలంలోని హంగర్గాలో సర్పంచ్ ఉదయ్ భాస్కర్‌తో కలిసి 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ బుకింగ్ సేవలను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 54 ట్రాక్టర్లు ఇసుక బుక్ చేసుకోగా వారికి శుక్రవారం తహశీల్దార్ అనుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యానువల్ విధానానికి స్వస్తి పలికామన్నారు. ఇక నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఇసుక బుకింగ్ యాప్‌ను వాహనదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఇసుక అవసరమైన వారందరూ ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇసుకను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వాహనదారులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డిలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యంతాగి రోడ్డుపైకి రావొద్దని అనేకమార్లు హెచ్చరించినప్పటికీ పట్టించుకోకుండా వాహనాలు నడుపుతున్నవారిపై కఠినచర్యలు తీసుకుంటున్నారు. జైలుశిక్షలు, జరిమానాలు విధిస్తున్నారు. జిల్లాలో గడిచిన రెండు నెలల్లో వందలాది మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నారు. కోర్టులు వారికి జరిమానాలతో పాటు జైలుశిక్షలు విధిస్తోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**




# తాగి వాహనాలు నడిపితే జైలుకే..

- రెండు నెలల్లో 222 మందికి శిక్ష
- 1,176 మందికి జరిమానాలు
- మందుబాబులపై పోలీసుల కఠినచర్యలు
- ముమ్మరంగా డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు

రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. మద్యం తాగి వాహనం నడిపితే ఎంతటివారైనా ఊపేక్షించడం లేదు. వాహనదారుల్లో మార్పు తేవడం కోసం కఠినచర్యలు తీసుకుంటున్నా పద్ధతులు మార్చుకోవడం లేదు.

### రెండు నెలల్లో 222 మందికి జైలు

జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో పోలీసులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. దాంతో ప్రతి రెండు రోజులకు ఒకసారి వందకు పైగా మందుబాబులు పోలీసులకు చిక్కి జైలులో జరిమానాలు చెల్లిస్తున్నారు. కేవలం గడిచిన రెండు నెలల కాలంలోనే జిల్లావ్యాప్తంగా 222 మందికి కోర్టులు జైలుశిక్ష విధించాయి. ఇటీవల ఓ వ్యక్తికి రూ.10వేల జరిమానా కూడా కోర్టు విధించింది.

### భారీగా జరిమానాలు.. శిక్షలు

జిల్లాలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలలో పోలీసులకు పట్టుబడిన వారికి న్యాయస్థానాలు భారీగా జరిమానాలు విధిస్తున్నాయి. గడిచిన రెండు నెలల్లో 1,176 మందికి జరిమానాలు విధించినట్లు పోలీసులు చెబుతున్నారు. వీరికి న్యాయస్థానం రూ.14.87 లక్షల జరిమానా విధించింది. అలాగే ఓ వ్యక్తికి ఏకంగా నెల రోజులు జైలు శిక్ష విధించగా ఐదుగురికి 15 రోజులు జైలుశిక్ష విధిస్తూ కోర్టులు తీర్పులిచ్చాయి.

### ఇంటికెళ్తారో.. జైలుకెళ్తారో నిర్ణయించుకోవాలి



మద్యం సేవించి వాహనం నడపవద్దని అనేకసార్లు వాహనదారులకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. అయినా చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. అందుకే డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇంటికి వెళ్తారా.. మత్తులో డ్రైవింగ్ చేసి జైలుకు వెళ్తారో నిర్ణయించుకోవాలి. **-రాజేష్ చంద్ర, ఎస్పీ**

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కళాశాలకు చెందిన ఏ.ఇందు (బీఏహెచ్ఈపీ) థర్డ్ ఇయర్, ఎల్.రాణి (ఎంపీసీఎస్) సెకండియర్, ఎస్.సౌమ్యరాణి (బీఏహెచ్ ఈపీ) సెకండియర్, ఎన్.బిందు (ఎంఎస్‌సీఎస్) ఫస్టియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులు సెకండ్ ఎడిషన్ సీఎం కప్-2026 మెదక్‌లో 20 నుంచి 23 వరకు జరగనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.చంద్రిక, పీడీ రజిత, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరుకావాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ ఆధ్వర్యంలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 22న ఎంట్రెన్స్ టెస్ట్ జరుగనుందని కళాశాల ప్రిన్సిపల్ చంద్రిక తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఆర్మూర్ కళాశాలలో సైతం పరీక్ష కేంద్రం ఉందన్నారు. 504 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాబోతున్నట్లు కళాశాల తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, పెన్నులు, గుర్తింపు కార్డు వంటివి వెంట తెచ్చుకొని, ఉదయం 9:30కు పరీక్షాకేంద్రానికి హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

## బైరాపూర్‌లో రేణుక పరంజ్యోతి ఎల్లమ్మ దేవి వార్షికోత్సవం



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో రేణుక పరంజ్యోతి ఎల్లమ్మ దేవి పంచమ వార్షిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు బైరాపూర్ ఆలయ కమిటీ గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఈనెల 22 నుంచి 25 వరకు ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు, యజ్ఞాలు, హోమాలు, అమ్మవారి ఆలయంలో భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో బైరాపూర్ ఆలయ కమిటీ గౌడ సంఘం సభ్యులు శ్రీశైలం గౌడ్, అంజా గౌడ్, సాయా గౌడ్, నరేష్ గౌడ్, హరీష్ గౌడ్, పోశా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్లుట్ల పేట గ్రామ అభివృద్ధికి కృషి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్లపేట గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్ పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రెయినేజీ, ఉపాధి హామీ పనులు, పెండింగ్ బిల్లులు తదితర విషయమై విస్తృతంగా సభలో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏడోవార్డులో 10 కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామసభలో తీర్మానించుకున్నామన్నారు. సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని ఆయన తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు ఉపసర్పంచ్ కర్రి చెవుల రాజు యాదవ్ మాట్లాడుతూ ప్రజల సూచనలు మా కార్యాచరణకు దారి చూపుతాయన్నారు. గ్రామాభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆది జగద్గురు రేణుకాచార్య మహా పాదయాత్ర ప్రారంభం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలం సుంకిని సద్గురు సిద్ధి లింగప్ప స్వామీజీ ఆధ్వర్యంలో ఆది జగద్గురు రేణుక ఆచార్యుల మహా పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ఈ యాత్ర యాదాద్రి జిల్లా ఆలేరు మండల కొలనుపాక వరకు జరుగనుందని స్వామీజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర భక్తులకు, మధ్యాహ్నం పోతంగల్‌లోని సాయిబాబా మందిరంలో హంగర్గా విజయ్ పటేల్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ.. జగద్గురు రేణుకాచార్యులు కొలనుకాక పుణ్య క్షేత్రంలో అన్నికులాల మఠాలను స్థాపించారన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ప్రాంతాల నుంచి సైతం భక్తులు కొలనుపాకకు వస్తారన్నారు. సుంకిని నుంచి బయలుదేరిన పాదయాత్ర బాన్సువాడ, గజ్వేల్ మీదుగా కొలనుపాక చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాగభూషణ స్వామి, రాజు మహారాజ్, సంతోష్ మహారాజ్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, గాంధారి:** మండలంలో ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లైన్ రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షుడు సంగని బాబా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలు సక్రమంగా అందించాలి



**అక్షరటుడే ఎల్లారెడ్డి;** మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు సక్రమంగా అందించి వాటిని ఉపయోగించేలా మహిళా సంఘాలను చైతన్యం చేయాలని ఐబీ డీపీఎం శ్రీనివాస్, బ్యాంక్ లింకేజీ డీపీఎం రాజయ్య , స్త్రీనిధి ఆర్ఎం కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఎల్లారెడ్డి ఏరియాలోని నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలతో ఐకేపీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. బ్యాంకు, స్త్రీనిధి లోన్లు, బకాయి వసూళ్లపై చర్చించారు. సమీక్ష సమావేశంలో ఏపీఎంలు రామ్ నారాయణ్ గౌడ్, వినోద్, రాజు, నాలుగు మండలాల సీసీలు, అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణచర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు గున్నాల బాలలక్ష్మి, బొదిరె లావణ్య, మల్లెల అనుపమ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని డ్రెయినేజీల్లో మురికి పేరుకుపోవడంతో దోమల బెడద పెరిగిందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు డెంగీ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమలను తరిమి కొట్టాలని సూచించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. అన్ని వార్డుల్లో చెత్త పేరుకుపోతోందని, మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న నిధులతో తక్షణమే చెత్త సేకరణ కోసం నాలుగు కొత్త ఆటోలను కొనుగోలు చేయాలని వారు కమిషనర్‌ను కోరారు.



## రోడ్డుపై ఇసుకతో ప్రమాదాలు.. పట్టించుకోని బల్దియా సిబ్బంది

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని పెద్ద బజార్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం బైక్‌పై నుంచి పడి ఓ యువతి గాయాలపాలైంది. ఇటీవల పెద్ద బజార్‌లో ప్రభుత్వం కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టింది. అయితే రోడ్డుపైనే ఇసుక, కంకర వేసి పనులను నిర్వహించారు. మిగిలిన ఇసుకను తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఓ యువతి బైక్‌పై వెళ్తూ ఇసుక కారణంగా జారిపడింది. ఈ క్రమంలో ఆమె కాలికి గాయమైంది. అదృష్టవశాత్తూ వెనక నుంచి ఎలాంటి వాహనం రాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై కల్వర్టు నిర్మాణం పూర్తయి రోజులు గడుస్తున్నప్పటికీ సంబంధిత శాఖ సిబ్బంది రోడ్డును శుభ్రపర్చలేదు. కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కూడా ఇందులో ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి రోడ్డుపై ఇసుకను తొలగింపజేయాలని కోరుతున్నారు.



## రెచ్చగొట్టేందుకే దిష్టిబొమ్మ దహనాలు.. పాల్వంచ బీజేపీ నాయకుల ఫైర్

**అక్షరటుడే, కామారెడ్డి :** ఓవైపు కార్యకర్తల సమావేశం జరుగుతుండగా తమను రెచ్చగొట్టేందుకే ఎమ్మెల్యే కేవీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారని పాల్వంచ బీజేపీ నాయకులు మండిపడ్డారు. పాల్వంచ మండల కేంద్రంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. షబ్బీర్ అలీపై చేసిన విమర్శలకు సమాధానం చెప్పలేకనే గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకుంటున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై షబ్బీర్ అలీ స్పందించాలని డిమాండ్ చేశారు. కేవీఆర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని విమర్శించారు. ఎమ్మెల్యే ఎక్కడికి రావడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని, అన్ని గ్రామాల్లో ఆయన పర్యటిస్తున్నారని స్పష్టం చేశారు. రూ.150 కోట్లు సొంత నిధులతో శాశ్వతంగా అభివృద్ధి పనులు చేస్తానని చెప్పారన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే ఎలా తిరుగుతాడో చూస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, ఆయన స్థానిక ఎమ్మెల్యే అని బరాబర్ తిరుగుతారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్వంచ మండల అధ్యక్షుడు పోసు అనిల్, నాయకులు తోట బాలరాజు, శ్రీనివాస్ గౌడ్, నర్సింహా చారి, శ్రీనివాస్ చారి, సత్యం యాదవ్, సురేష్, సంతోష్ రెడ్డి, పరశురాం యాదవ్, లింగం, బాలరాజు పాల్గొన్నారు.